ADMISSIONS ARE IN PROGRESS 2024-25
Secretary & Correspondent
Bikki Venkateshwarlu
M.Sc (Physicis), M.Ed.
Join your kids with us & Empower their Academic Excellence with Ethical Foundations
INDIRA VIDYALAYA
Nursery to VII class, English Medium
Near Bodrai, Mahabubabad.
Cell: 9701912300, 9705412300

దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 01 సంచిక : 275 ఆదివారం 29-9-2024 | ఎడిటర్ : వేముల అయోధ్య రాములు | పేజీలు : 4 | వెల : 5 రూ/..

## పేదలకు న్యాయం దక్కేలా చూడండి

**- న్యాయవ్యవస్థలోనూ కృత్రిమ మేధ అమలు**

**- నల్సార్ విద్యార్థులకు డిగ్రీలు, బంగారు పతకాలు ప్రదానం - నల్సార్ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ముర్ము**




**తొలి సమయం హైదరాబాద్,సెప్టెంబర్28:** ప్రపంచ వ్యాప్తంగా ప్రస్తుతం సాంకేతికంగా ఎన్నో మార్పులు వస్తున్నాయని, న్యాయ వ్యవస్థ కూడా కృత్రిమమేధను మరింత ఉపయోగించుకొని బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము అన్నారు. కృత్రిమ మేధ పేదలకు అందుబాటులోకి రావాలని, వారికి అండగా నిలవాలని ఆకాంక్షించారు. ధనికులతో పోలిస్తే పేదలు న్యాయం పొందలేక పోతున్నారని.. మెరుగైన సమాజం కోసం ఈ విధానంలో మార్పు రావాలని రాష్ట్రపతి అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీ న్యాయబద్ధంగా సత్యాగ్రహ దీక్ష చేసి ఆదర్శంగా నిలిచారని ముర్ము అన్నారు. నిబద్ధత, పారదర్శకంగా పనిచేస్తే న్యాయవాద వృత్తిలో ఎంతో ఎత్తుకు ఎదగొచ్చని తెలిపారు. నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 21వ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పీహెచ్‌డీ, ఎల్ఎల్ఎంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రాష్ట్రపతి చేతుల మీదుగా బంగారు పతకాలు అందించారు.

రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము, స్నాతకోత్సవ ప్రసంగంలో చట్టంలోని వివిధ రంగాలలో నల్సార్ కృషిని ప్రశంసించారు. ప్రధానం గా నల్సార్ జంతు సంరక్షణ చటాల గురించి చేస్తున్న కృషిని ప్రస్తావించారు. ఒరిస్సా ప్రభుత్వంలో తాము మత్స్యశాఖ, జంతు వనరుల అభివృద్ధి మంత్రిగా ఆమె గతంలో పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకుంటూ, జంతువుల రక్షణ, సంక్షేమం గురించి ప్రజలను చైతన్యం చేయడంలో ఈ జంతు సంరక్షణ చట్టాల అవగహన అత్యవసరం అని అన్నారు. భారతదేశంలోని ప్రాచీన భారత పరిపాలన, న్యాయ సంప్రదాయాలను గురించి మాట్లాడారు. కౌటిల్యుని అర్థశాస్త్ర ములో, ప్రాచీన భారత్ దేశంలో చట్టపరమైన పరిపాలనా వివరణ ఉన్నది అని తెలిపారు.దక్కన్ ప్రాంతంలో రచించబడిన అపస్తంభధర్మసూత్రాలను ఆమె ప్రస్తావించింది. దేశం ఉన్నత న్యాయ సంప్రదాయాన్ని పట్టభద్రులు గుర్తుఉంచుకోవాలని ఆమె ఉద్బోధించారు

## వేర్పాటువాదం..రక్తపాతానికి చోటులేదు...

**బిజెపి పాలన కోరుకుంటున్న కాశ్మీర్‌లో ప్రజలు**

**మూడో విడత ప్రచారాంలో ప్రధాని మోడీ**



**జమ్మూ,సెప్టెంబర్28:** తొలి రెండు విడతల పోలింగ్ అనంతరం జమ్మూకశ్మీర్లో తొలిసారి పూర్తి మెజారిటీతో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమైందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. బీజేపీ ప్రభుత్వాన్ని ఇక్కడి ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. అక్టోబర్ 1న తుది విడత పోలింగ్ నేపథ్యంలో శనివారంనాడిక్కడ జరిగిన ఎన్నికల ప్రచార సభలో మోదీ పాల్గొన్నారు. ఉగ్రవాదం, అవినీతి అంశాలకు సంబంధించి కాంగ్రెస్, దాని భాగస్వామ్య పార్టీ నేషనల్ కాన్ఫరెన్స్, మెహబూబా ముఫ్తీ సారథ్యంలోని పీడీపీపై విమర్శలు గుప్పించారు. మొదటి రెండు విడతల పోలింగ్ సరళితో బీజేపీ తొలిసారి జమ్మూకశ్మీర్‌లో పూర్తి మెజారిటీ సాధించడం ఖాయమైంది. బీజేపీ ప్రభుత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారు. రెండు విడతల్లో ప్రజలు భారీగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో బీజేపీ గెలుపు తథ్యమైందని మోదీ ధీమా వ్యక్తం చేశారు. ప్రజల అభిమతంతో తొలిసారి జమ్మూకశ్మీర్‌లో ప్రభుత్వం ఏర్పడనుందని, ఇక్కడ ఎన్నో ఆలయాలు ఉన్నాయని, ఈ అవకాశాన్ని వదు లుకోవద్దని, బీజేపీ ప్రభుత్వం ప్రజల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తుందని భరోసా ఇచ్చారు. జమ్మూకశ్మీర్‌లోని కాంగ్రెస్, ఎన్‌సీ, పీడీపీల 'మూడు కుటుంబాల' పాలనతో ప్రజలు విసిగిపోయారని, ప్రజలు శాంతిని కోరుకుంటున్నారని ప్రధాని అన్నారు. అవినీతి, ఉద్యోగాల్లో వివక్ష తిరిగి చోటుచేసుకోరాదని, వేర్పాటువాదం, రక్తపాతానికి ఇంకెంత మాత్రం చోటులేదని ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు. ఇక్కడి ప్రజలు శాంతిని కోరు కుంటున్నారు. తమ పిల్లలకు మంచి భవిష్యత్తును ఆశిస్తున్నాను. ఆ కారణంగానే జమ్మూకశ్మీర్ ప్రజలు బీజేపీ పాలన రావాలని కోరుకుంటున్నారు' అని మోదీ అన్నారు. 2016 సెప్టెంబర్ 18న భారత్ చేపట్టిన సర్జికల్ దాడులను ప్రధాని గుర్తుచేస్తూ, సరిహద్దు ఉగ్రవాదంపై సర్జికల్ దాడులతో ప్రపంచానికి తాము విస్పష్టమైన సందేశం ఇచ్చామని, ఇది న్యూ ఇండియా అని, ఉగ్రవాదాన్ని సహించేది లేదని చాలా స్పష్టంగా తెలియజేశామని అన్నారు.

## అన్ని సేవలు కలిపి డిజిటల్ కార్డులు

**రేసన్ కార్డు వివరాల ఆధారంగా రూపకల్పన**

**మహిళల పేరుతో జారీకి సిఎం రేవంత్ ఆదేశం**



**హైదరాబాద్,సెప్టెంబర్28:** ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డు, ఆరోగ్య శ్రీ కార్డుల స్థానంలో అన్ని సేవలనూ కలిపి ఒకే ఫ్యామిలీ డిజిటల్ కార్డు కిందకు తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై సిఎం రేవంత్ సమీక్షించి పథకాన్ని ముందుకు తీసుకుని వెళ్లాలని సూచిచారు. ఈ క్రమంలో ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీ, విధివిధానాలపై సీఎం రేవంత్ రెడ్డి శనివారం సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం జారీ చేసే ఫ్యామిలీ డిజిటల్ కార్డులో మహిళనే ఇంటి యజమానిగా గుర్తిస్తామని తెలిపారు. కుటుంబ సభ్యుల పేర్లు, వారి వివరాలున్నింటినీ కార్డు వెనుక పొందుపర్చాలని అధికారులను ఆదేశించారు.

## మూసీలో పారుతున్న పేదల కన్నీళ్లు

### పేదల కన్నీళ్లపై అభివృద్ధి ఎలా సాధ్యం

### మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు




**తొలి సమయం హైదరాబాద్,సెప్టెంబర్28:** మూసీలో గోదావరి నీళ్లు పారిస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి.. పేద, మధ్య తరగతి ప్రజల కన్నీళ్లు పారిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ప్రభుత్వానికి పేదల ఆశీర్వాదాలు ఉండాలని, వారి గోసలు కాదని చెప్పారు. పేదల కన్నీళ్లపై అభివృద్ధి చేయడం ఏంటని ప్రశ్నించారు. మీ సోదరుడికి నోటీసులు ఇచ్చి, పేదల ఇంటికి బుల్డోజర్లు పంపుతారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ లీగల్ సెల్ ప్రతినిధులు, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో హైడ్రా బాధితులతో హరీశ్ రావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదల ఇండ్లు కూల్చి మూసీపై పెద్ద భవనాలకు అనుమతి ఇస్తామంటు న్నారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం బాధితుల వద్దకు వస్తుందన్నారు. కేసీఆర్ పాలనలో ప్రజలను ఇబ్బంది పెట్టలేదని చెప్పారు. సీఎం రేవంత్ అనాలోచిత నిర్ణయాలతో పాలన చేస్తున్నారని విమర్శించారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్న అంశంపై దృష్టి సారించాలని హితవు పలికారు. ప్రజలు రోగాలబారిన పడుతున్న ప్పుడు వాటిపై దృష్టి పెట్టే ఆలోచన ముఖ్యమంత్రి చేయలేదని విమర్శించారు. హైదరాబాద్ ఖ్యాతిని సీఎం రేవంత్ దెబ్బ తీస్తున్నారని చెప్పారు. అఖిలపక్ష సమావేశం నిర్వహించిన తర్వాతే మూసీపై ముందుకు వెళ్లాలని డిమాండ్ చేశారు. కూకటపల్లిలో హైడ్రా బాధితురాలు బుచ్చమ్మది ఆత్మహత్య కాదని, అది రేవంత్ రెడ్డి చేసిన హత్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముగ్గురు బిడ్డలకు ఇల్లు కట్టించి పెండ్లిళ్లు చేసిందని, ఆ ఇల్లు కూలగొడితే తన బిడ్డల భవిష్యత్తు ఏం అవుతుందని బాధతో ఆత్మహత్య చేసుకుందని వాపోయారు. మొన్న కూడా ఒక ఆమె ఇల్లు కూలకొట్టే సరికి గుండె పోటుతో చనిపోయిందన్నారు. ఇవ్వన్నీ రేవంత్ రెడ్డి పిచ్చి నిర్ణయాల వల్లే జరుగుతున్నాయన్నారు. రాహుల్ గాంధీ హర్యానా ఎన్నికల ప్రచారంలో బుల్డోజర్ రాజ్ నహి చలేగా అంటూ ప్రచారం చేస్తున్నాడని, మరి తెలంగాణలో ఏం జరుగుతున్నదని ప్రశ్నించారు. నేడు తెలంగాణలో కూడా బుల్డోజర్ రాజ్యం నడుస్తుందన్నారు. ముందు తెలంగాణకు వచ్చి బుల్డోజర్లు ఆపి ఆ తరువాత బుల్డోజర్ రాజ్ నహి చలేగా అంటూ ఇక్కడ ప్రచారం చేయాలన్నారు.

## వక్రబుద్ధిని వీడని పాక్ ప్రధాని

- **ఐక్యరాజ్య సమితిలో కాశ్మీర్ ప్రస్తావన**
- **370 ఆర్టికల్‌పైనా ప్రేలాపనలు**
- **గట్టిగా తిప్పికొట్టిన భారత్ ప్రతినిధి భవిక మంగళానందన్**



**న్యూఢిల్లీ,సెప్టెంబర్28:** భారత్ చేతిలో ఎన్నిసార్లు భంగపడినా.. దాయాది దేశం పాకిస్థాన్ మాత్రం తన వక్రబుద్ధిని మార్చుకోవడం లేదు. ఐక్యరాజ్య సమితివేదికగా భారత్‌పై పాకిస్థాన్ మరోసారి అక్కసు వెళ్లగక్కగా.. మన దౌత్యవేత్త భవిక మంగళానందన్ గట్టిగా తిప్పికొట్టారు. పాక్ ప్రధాని షెహబాజ్ కశ్మీర్ అంశాన్ని లేవనెత్తి, ఆర్టికల్ 370 రద్దుపై మాట్లాడుతూ.. ఉగ్రవాదం విషయంలో పాకిస్థాన్, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ గురించి మాట్లాడటమేంటో అని గట్టిగా కౌంటర్ ఇచ్చారు. ఈ ప్రపంచ వేదిక దురదృష్టవశాత్తూ అవాస్తవాలను వినాల్సి వచ్చింది. పాకిస్థాన్ ప్రధాని భారతదేశం గురించి ప్రస్తావించడంపై నేను మాట్లాడుతున్నాను. పాక్ సుదీర్ఘకాలంగా సీమాంతర ఉగ్రవాదాన్ని పొరుగు దేశాలపై ఆయుధంగా ఉపయోగిస్తోందని అందరికీ తెలుసు. అలాంటి దేశం హింస గురించి మాట్లాడటం వంచనే అవుతుంది.ఎన్నికల్లో రిగ్గింగ్ చేసే దేశం..ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతోంది. వాస్తవమేంటంటే.. ఆ దేశం మా భూభాగాన్ని కోరుకుంటోంది. జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలకు అవాంతరం కలిగించేందుకు నిరంతరం ఉగ్రవాదాన్ని ఉపయోగిస్తోంది. మిలిటరీ సాయంతో నడుస్తూ, ఉగ్రవాదం విషయంలో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపుపొందిన పాక్.. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ గురించి మాట్లాడటమా అని భవిక తీవ్రంగా స్పందించారు. ఐరాస జనరల్ అసెంబ్లీ 79వ సెషన్‌లో సాధారణ చర్చ సందర్భంగా ఊహించినట్లుగానే ప్రధాని షహబాజ్ షరీఫ్ జమ్మూకశ్మీర్ అంశాన్ని లేవనెత్తడంతో పాటు ఆర్టికల్ 370 గురించి మాట్లాడటం గమనార్హం. దాదాపు 20 నిమిషాల పాటు చేసిన ప్రసంగంలో తమ దేశంలోని సమస్యలను వదిలేసిన షరీఫ్.. కేవలం కశ్మీర్ గురించే సుదీర్ఘంగా మాట్లాడారు. పాలస్తీనా ప్రజల మాదిరిగా నే జమ్మూకశ్మీర్ ప్రజలు కూడా స్వేచ్ఛ, నిర్ణయాధికారం కోసం పోరాడుతున్నట్లు వ్యాఖ్యానించారు. ఆర్టికల్ 370 రద్దును ప్రస్తావిస్తూ.. శాంతిస్థాపన కోసం 2019 ఆగస్టులో భారత్ ఏకపక్షంగా, చట్టవిరుద్ధంగా చేపట్టిన చర్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. ఐరాస భద్రతా తీర్మానాలకు అనుగుణంగా కశ్మీర్ సమస్యపై శాంతియుత పరిష్కారం కోసం చర్చలు జరపాలన్నారు. ప్రపంచ వేదికలపై జమ్మూకశ్మీర్ అంశాన్ని ప్రస్తావించి భంగపాటుకు గురికావడం పాకిస్థాన్‌కు కొత్తేమీ కాదు. గతంలోను పలుమార్లు ఆయా ఫోరమ్‌లలో చర్చిస్తున్న అంశాలు, వాటి ప్రాముఖ్యతతో సంబంధం లేకుండా భారత్‌పై విషం చిమ్మడమే పనిగా పెట్టుకున్న సందర్భాలు అనేకం. మరోవైపు, జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌లు భారత్‌లో అంతర్భాగమని, విడదీయరాని భాగమంటూ భారత్ ఎప్పటికప్పుడు స్పష్టం చేస్తూ వస్తోంది. కశ్మీర్ సమస్యను లేవనెత్తడం, భారత్‌పై విషం చిమ్మడం మానుకొని తమ దేశంలోని అంతర్గత సమస్యలను పరిష్కరించడంపై దృష్టిపెట్టాలని భారత్ చెబుతున్నా పాకిస్థాన్ వైఖరిలో మార్పు కనబడటం లేదు.

## బిజెపి సభ్యత్వ నమోదు లక్ష్యం చేరుకోవాలి

### స్థానిక సమస్యలపైనా పోరాడుతుండాలి

### పార్టీ శ్రేణులకు బిజెపి అధ్యక్షుడు నడ్డా సూచన

### ముఖ్య నేతలతో సభ్యత్వంపై హైదరాబాద్‌లో సమావేశం




**తొలి సమయం, హైదరాబాద్,సెప్టెంబర్28:** 15 రోజుల్లో నిర్దేశించుకున్న సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని పూర్తి చేయాలని భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. బేగంపేట హరిత ప్లాజాలో జరిగిన భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమానికి నడ్డా ముఖ్యఅథిగా హాజరయ్యారు. పార్టీ సభ్యత్వ నమోదుపై దేశ వ్యాప్తంగా పర్యటిస్తున్న ఆయన.. శనివారం పాట్నా నుంచి ప్రత్యేక విమానంలో బేగంపేట చేరుకున్నారు. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, పోటీ చేసిన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులతో పాటు రాష్ట్ర పదాధికారులతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో జరుగుతున్న పార్టీ సభ్యత్వ నమోదుపై ఆరా తీశారు. తెలంగాణలో 50లక్షల సభ్యత్వ నమోదు లక్ష్యంగా పెట్టుకోగా.. లక్ష్యానికి మించి చేయాలని దిశానిర్దేశం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి 77 లక్షల ఓట్లు, 8 ఎంపీ సీట్లు వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. 77లక్షల ఓట్లు వచ్చినప్పుడు 50 లక్షల సభ్యత్వం అంత కష్టమేమీ కాదని.. అన్ని వర్గాలను కలిసి సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. అత్యధిక సభ్యత్వం నమోదు చేయించిన వారికే పదవులు దక్కుతాయని స్పష్టం చేశారు. సభ్యత్వ నమోదుతో పాటు స్థానిక సమస్యలపై పోరాటం చేయాలని దిశా నిర్దేశర చేశారు. రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం తీసుకోవాల్సిన అంశాలపై జేపీ నడ్డా ఆరా తీసినట్టు సమాచారం. అలాగే ప్రజాసమస్యలపై పోరాటం చేయాలని నడ్డా సూచించారు. పార్టీ లైన్ దాటకుండా ఎప్పటికప్పుడు.. అధిష్ఠానం నిర్ణయానికి అనుగుణంగా పనిచేయాలని నడ్డా హితవు పలికారు. పార్టీలో ఎలాంటి గ్రూపు రాజకీయాలకు అవకాశం లేదని నడ్డా హెచ్చరించారు. వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నేతలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని జేపీ నడ్డా ఆదేశించారు. అత్యధిక సభ్యత్వ నమోదు చేయించిన వారికే పదవులు దక్కుతాయని నడ్డా స్పష్టం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం అంశాలపై ఆరా తీశారు.

# మానుకోట మాడ్రా యాక్షన్ ప్లాన్‌కు లైన్ క్లియర్

**అక్రమ నిర్మాణాల తొలగింపు ప్రక్రియకు బంధం చెరువు నిజాం చెరువుల తో షురూ..**



**తొలి సమయం మహబూబాబాద్ సెప్టెంబర్ 28:** మానుకోట చెరువుల్లోని అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు మాడ్రా యాక్షన్ ప్లాన్ కు లైన్ క్లియర్ అయినట్లు తెలుస్తోంది. ఎప్పుడు ఏ సమయంలో కూల్చివేతలకు రంగ ప్రవేశం చేసేందుకు అధికారులు అన్ని రకాల క్లీన్ చిట్స్ పొంది ఉన్నారనే సమాచారం హడావుడి చేస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి సైతం మానుకోట లోని చెరువుల ఆక్రమణలపై ఎప్పటికప్పుడు నిఘా విభాగాలతో సమాచారం సేకరిస్తున్నట్లు బలమైన చర్చలు కొనసాగుతున్నాయి 76 మందికి ముందస్తు నోటీసులు ఇచ్చినట్లు మున్సిపాలిటీ అధికారులు తెలియజేస్తున్నారు. ఇరిగేషన్ రెవెన్యూ మున్సిపాలిటీ అధికారులు సంయుక్తంగా నిర్ణయాలు తీసుకుంటూ ఎప్పటికప్పుడు కలెక్టర్ కు సమాచారం తెలియజేస్తున్నట్లు టాక్ నడుస్తోంది మహబూబాబాద్ పట్టణ నడిబొడ్డులో అందమైన ప్రకృతి అందాలకు పెట్టిన పేరుగా ఉన్న నిజాం చెరువు చుట్టుపక్కల ఉన్న అక్రమార్కుల అక్రమ నిర్మాణాలపైన్నే ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది ఇరిగేషన్ శాఖ ఇచ్చిన తప్పుడు ఎన్ఓసీలు, ఇచ్చిన అధికారులపై ఫోకస్ పెట్టినట్లుగా తెలుస్తోంది శాంత కుమారి, గునుగంటి పద్మ,గురజాల అలేఖ్య, కందిరాజు భవాని,గునిగంటి కమలాకర్,నాయిని రంజిత్, పల్లా రామచంద్రారెడ్డి ముత్యం వెంకన్న ఆవుల వెంకన్న గద్దం విజయ్ కుమార్ శ్రీ రామోజీ రమేష్, శాంత్విక్ రెడ్డి, లు బంధం చెరువు నుండి ఎన్ఓసీలు పొంది ఉన్నారు అలాగే శ్రీమతి సత్య మనోరమ ( జమాండ్ల పెళ్లి) పెట్రోల్ డీజిల్ అవుట్ లెట్ బంకు ఈదుల పూస పల్లి లకు ఇరిగేషన్ అధికారులు ఎన్ఓసీలు ఇచ్చినట్లు తెలిపారు. అయితే ఈ ఎన్ఓసీలలో హేతుబద్ధత ఉన్నదా లేదా అనే కోణంలో మాడ్రా నిషిత పరిశీలన చేస్తున్నారని సమాచారం,ఒకవేళ అక్రమంగా ఇరిగేషన్ అధికారులు ఇచ్చినట్లు అయితే వాళ్లపై కూడా నిర్దాక్షిణ్యంగా యాక్షన్ ప్లాన్ చేయడానికి మాడ్ర సంసిద్ధమైనట్లు సమాచారం,

# భూపోరాటం కమ్యూనిస్టులే కాదు మానుకోటలో అన్ని పార్టీలది అదే తీరు

**భూపోరాటం పేరున ప్రభుత్వ భూములను పప్పు బెల్లం లా అమ్ముకున్న పలక పార్టీలు**

**.ఇక్కడ మొదట కమ్యూనిస్ట్ లు పిదప అన్ని పార్టీలు భూపోరాటం పేరున ప్రభుత్వభూముల్లో కాలనీలు ఏర్పాటు చేసుకొన్నారు**

**చెరువు షికాలనుండి గుడిసెలు తొలగించే ముందు.. ఇల్లు కోల్పోయిన వారికి 70 గజాల జాగతో పాటు ఇల్లు కట్టించి ఇవ్వాలి**






**తొలి సమయం మహబూబాబాద్ సెప్టెంబర్ 28:** ఒకప్పుడు భూ పోరాటాలు కేవలం ఎర్రజెండా పార్టీలు, కమ్యూనిస్టు పార్టీలకే సొంతం అన్నట్లుగా ఉండేది. మానుకోటలోఉభయ కమ్యూనిస్టులతో పాటు.. అన్ని ఎర్రజెండా పార్టీలు భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు చేసిన ఘనమైన చరిత్ర కలిగి ఉన్నాయి.. కాలం తెచ్చిన మార్పులతో భూ పోరాటాల అర్థం మారిపోయింది.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో తెలుగుదేశానికి మద్దతుగా ఉభయ కమ్యూనిస్టు పార్టీలు కాంగ్రెస్ తో ఎన్నికల్లో తలబడేది.జనాన్ని జనం పాటలతో ఊర్రూత లూగించి ఓ వెలుగు వెలిగారు. ఎత్తులు వ్యూహాల్లో భాగంగా ఆపార్టీ తనదైన ఓ ప్రత్యేకతను సంతరించుకొని. బలమైన చర్చనీయాంశంగా మారింది, కాలక్రమమైన రాజకీయ సమీకరణాల్లో వచ్చిన అనూహ్య మార్పుల కారణంగా ఉభయ కమ్యూనిస్టుల ఉనికి ప్రశ్నార్ధకమయ్యింది.... అన్ని పార్టీలు కూడ కాలనీల ఏర్పాటుకు స్వీకారం చుట్టాయి..

**పాలక పార్టీలు**

తెలుగుదేశంహయాంలో లో శ్రీరామ్ భద్రయ్య కాలనీ, ఎన్టీఆర్ కాలనీలు ఏర్పడగా.. కాంగ్రెస్ పార్టీ కాలనీలు.. రామన్న పేట కాలనీ, రాజీవ్ కాలనీ వైఎస్ఆర్ కాలనీ, రెడ్యానాయక్ కాలనీ, కవితకాలనీలతో పాటు -కెటీఆర్ కాలనీ,లు ఏర్పడ్డాయి

**సిపిఐ కి సంబంధించిన కాలనీలు**

వేల్పుల సత్యంకాలనీ, గిరి ప్రసాద్ నగర్ కాలనీ, ధర్మన్న కాలనీ, పార్థసారథి కన్న కాలనీ, తలారి వెంకటేశ్వర్లు కాలనీ,మాస బత్తిని వెంకటమల్లు కాలనీ, కొండపల్లి గోపాల్ రావు కాలనీ, మిలిటరీ కాలనీలు, భగత్ సింగ్ కాలనీ, ఏర్పడ్డాయి,

**సిపిఎం కాలనీలు...**

సుందరయ్య నగర్, జ్యోతి బస్ నగర్, కుండ్లకుంట, ఆకుల లక్ష్మయ్య నగర్, ఎన్ ఎం నగర్, సిహెచ్ నగర్, టీ బీనగర్, కొత్త కలెక్టర్ పాత కలెక్టర్ ఆఫీస్ కాలనీలు మల్లు స్వరాజ్యం నగర్ ఎల్బీజీ నగర్..

**సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కాలనీలు**

భగత్ సింగ్ కాలనీ, మాధవ్ అన్న కాలనీ, విక్రమ్ నగర్ కాలనీ, దొరన్న నగర్, అంజన్న నగర్ ప్రగతి నగర్, ఎమ్మార్పిఎస్ కాలని, మందకొమురమ్మ కాలనీ. వికలాలాంగుల కాలనీలు ఏర్పడ్డాయి.. ఇతరత్రా పేర్లపై కాలనీలులు కూడా ఉన్నాయి అని తెలుస్తోంది.మరీవిచిత్రం ఏమిటీ అంటే కాంగ్రెస్ తెలుగుదేశం కాలనీలు బ్రతికి ఉన్నోళ్ల పేరున కాలనీలు ఏర్పడడం మితిమీరిన చైతన్యానికి నిదర్శనంగా మానుకోట నిలిచింది అనడానికి భూ పోరాటాల పేరుతో.. కాంగ్రెస్ తెలుగుదేశం కాలనీల్లోని జనం ఆ ఇంటి జాగాలను కొనుక్కున్నారని.. పోరాటం అసలే కాదు అనే ప్రచారం కూడా నడుస్తోంది.మాడ్రా పేరున చెరువుల రక్షణకోసం వస్తున్న సంస్థ.. చెరువు శికాల్లో ఉన్న బడా బాబుల ఇండ్లు అటు ఉంచితే పేదోళ్ల ఇండ్లు కూల్చే ముందు వాళ్లకు 70 గజాలతో పాటుగా ఇందిరమ్మ ఇల్లు లేదా డబుల్ బెడ్ రూమ్ సౌకర్యం కల్పించాలి.. అనే డిమాండ్ తో చెరువు శికాల్లోని పేదోళ్లు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు.

# భూపాలపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా భగత్ సింగ్ 117వ జయంతి వేడుకలు

**అక్రమ అరెస్టులను ఖండిస్తూ ఎస్ఎఫ్ఐ భూపాలపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం**

**రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ దామెరా కిరణ్**




**తొలి సమయం భూపాలపల్లి, సెప్టెంబర్ 28**

భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ ఎఫ్ ఐ జయశంకర్ (భూపాలపల్లి) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా భగత్ సింగ్ 117వ జయంతి వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ మాట్లాడుతూ 23 సంవత్సరాల వయసులోనే ఈ దేశం కోసం ఊరుకోయ్యాలను సరసాలను ముద్దాడిన భగత్ సింగ్ నేటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని వారన్నారు. ఈ దేశంలో ఒక దిక్కు మతోన్మాద విధానాలు మరో దిక్కు సావర్కర్ లాంటి దేశద్రోహుల చరిత్ర ను పాఠ్యాంశాలలో లిఖిస్తున్న కేంద్ర ప్రభుత్వం మతాల మధ్య చిచ్చుపెట్టే అటువంటి కుట్రను, వ్యతిరేకించాలంటే నిజమైన దేశభక్తుడు అయినటువంటి భగత్ సింగ్ లాంటి పోరాట జీవిత చరిత్రను అధ్యయనం చేయాలి అన్నారు. భగత్ సింగ్ స్ఫూర్తితో ఈ దేశంలో మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయవలసిన అవసరం ఉంది అన్నారు. అదేవిధంగా పుస్తకాల నుండి దేశ చరిత్ర నీ తొలగిస్తూ ఈ దేశాన్ని అజ్ఞానంలో నెట్టే ప్రయత్నంలో ఈ కేంద్రంలో కూడా బీజే ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని వారు అన్నారు. ఈ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చినటువంటి నూతన జాతీయ విద్యా విధానం అమలు చేయడంలో తీవ్ర ప్రయత్నాలు చేస్తుందన్నారు. నూతన జాతీయ విద్యా విధానం వల్ల పేద విద్యార్థులకు విద్య అందరిని, ద్రాక్షల తయారవుతుందన్నారు. ఈ దేశంలో భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న విద్యావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరావలసిన అవసరం ఉందని అన్నారు. చలో హైదరాబాద్ కార్యక్రమానికి సంబంధించి సెప్టెంబర్ 27న నిర్వహించిన హలో విద్యార్థి చలో హైదరాబాద్ విద్యార్థి మహాగర్జన ధర్నా కార్యక్రమం సందర్భంగా ధర్నా చేసిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకత్వంపై అక్రమ అరెస్టను తీవ్రంగా ఖండిస్తూ శనివారం ఏ స్ఎఫ్ఐ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజు మాట్లాడుతూ. భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన నిర్వహించినటువంటి ఇంద్ర పార్క్ విద్యార్థి మహాగర్జన ధర్నా లో ప్రజా ప్రభుత్వం. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులను అక్రమంగా అరెస్టు చేసి కేసులు బనాయించటం . విద్యార్థుల యొక్క హక్కులను కాలరాయడం తప్ప మరొకటి కాదు అని వారు వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులు కచ్చితంగా 8 మాసాలు గడుస్తున్నప్పటికీ ఈ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఇవ్వాల్సిన స్కాలర్షిప్ రియంబర్స్మెంట్ మెస్ కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయమంటే విద్యార్థులపై అక్రమ అరెస్టు చేసి బెదిరింపులకు గురి చేయడం అనేది ఎట్లా ప్రజా పరిపాలన అవుతుందని ప్రశ్నించారు.మార్పు కావాలని కోరుకున్న విద్యార్థులకు ఈ రోజు విద్యారంగంలో ఏ క్కడ వేసిన గొంగడు అక్కడనే పద్ధతులు సమస్యల చూపిస్తూ కొత్త ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కి మార్పు అంటే ఇదేనా అని వారు అన్నారు . పురుగుల అన్నం నీళ్ల చారును ఫుడ్ పాయిజన్ వ్యవస్థను ఈ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులు చూపిస్తుంది. ఇదేనా మార్పు అంటే అని చెప్పేసి వారు ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమ అరెస్టు లతో భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ పోరాటాలు అన్నివేసే ప్రయత్నం చేస్తే గతంలో ఇదే కాంగ్రెస్ ప్రభుత్వంనీ, గద్దె దిచ్చిన చరిత్ర భారత విద్యార్థి ఫెడరేషన్ ది వారు గుర్తు చేశారు. అదేవిధంగా ఏదైతే తమ హక్కుల కోసం పోరాడిన భారత విద్యార్థి ఫెడరేషన్ విద్యారంగంలో నెలకొన్న సంస్థలు వెంటనే స్కాలర్షిప్స్ ఫీజు రీయింబర్స్ మెంట్ కాస్మోటిక్స్ చార్జీలు విడుదల చేయాలి పెరిగిన ధరలకు అనుగుణంగా పెంచాలి అని వారు ప్రభుత్వం నీ డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు గానీ ఏదైతే బదిలీల ద్వారా ఖాళీ అయినటువంటి ఉపాధ్యాయ పోస్టులు , అదేవిధంగా యూనివర్సిటీలో విసి లను వెంటనే నియమించాల్సిన అవసరం ఉందని వారు ఈ రాష్ట్ర ప్రభుత్వాలు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈ రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలను మంత్రులను సెక్రటేరియట్ని ముఖ్యమంత్రి ఇంటితో సహా ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు.నరేష్ కోటేష స్వామి చరణ్ వంశి అర్జున్ శివకేశవ



# శ్రీ శారద శరన్నవరాత్రి మహోత్సవాల ఆహ్వాన పోస్టర్ ఆవిష్కరణ



**తొలి సమయం, కరీంనగర్ /సెప్టెంబర్ 28**

కరీంనగర్ పట్టణం కిసాన్ నగర్ లోని పరివార సమేత శ్రీ శ్రీ శ్రీ విజయ దుర్గా దేవి ఆలయంలో శ్రీ శారద శరన్నవరాత్రి ఉత్సవ ఆహ్వానం పేరిట రూపొందించిన పోస్టర్లను శనివారం రోజున వేద పండితులు పురాణం మహేశ్వర శర్మ, దేవాలయ కమిటీ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. అక్టోబర్ మూడు నుండి 12వ తేదీ వరకు దేవాలయంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరికి ఆహ్వానం పలుకుతున్నట్టు ఆలయ కమిటీ బాధ్యతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు రామ్ శంకర్, సుధాకర్, ఆకుల నరేష్, ఇసపల్లి మహేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దుర్గామాత విగ్రహా బహుకరణ

**విగ్రహాన్ని అందజేసిన ప్రైవేట్ లెక్చరర్స్**

**అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గూడూరు సతీష్ కుమార్**

**కృతజ్ఞతలు తెలిపిన న్యూ స్టార్ యూత్ సభ్యులు, గ్రామ వాసులు**



**తొలి సమయం, హన్మకొండ/ సెప్టెంబర్ 28**

దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దామెర మండలంలోని ఊరుగొండ గ్రామ వాసి గూడూరు సతీష్ కుమార్ (ప్రైవేట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి) గ్రామంలో దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దుర్గామాత విగ్రహాన్ని అందజేస్తూ నవరాత్రులకు కావలసిన పూజకు సామాగ్రి ని కూడా సమకూర్చుతున్నానని తెలిపారు.ఈ సందర్భంగా గూడూరు సతీష్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా మన దేశంలో బతుకమ్మ పండుగకు విశిష్టత ఉందని,పూలతో బంగారు బతుకమ్మ ను పేర్చి పూజించే సంస్కృతి తెలంగాణకు మాత్రమే సొంతమని అన్నారు.ఈ నవరాత్రుల సందర్భంగా మా గ్రామంలో దుర్గా మాత విగ్రహం ఇవ్వడం జరుగుతుందని గ్రామ యూత్,ప్రజల సహకారం ఉండాలని అన్నారు. ప్రతి పండుగను ఐకమత్యంతో కలిసి జరుపుకోవాలని సూచించారు.న్యూ స్టార్ అసోసియేషన్ లో సభ్యులు, యువత కూడా గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.ఆ దుర్గామాత కృపా కటాక్షం ప్రజలందరి పై ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జక్కుల రవీందర్, సాంబారి నరేష్, గడ్డం వెంకటేష్, పగడాల సుమన్ తోపాటు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో చేరిన పాక్స్ చైర్మన్ కొత్త తిరుపతి రెడ్డి



**తొలి సమయం కరీంనగర్/సైదాపూర్/ సెప్టెంబర్ 28**

రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో సైదాపూర్ వేంకేపల్లి పాక్స్ చైర్మన్ కొత్త తిరుపతి రెడ్డి కాంగ్రెస్ పార్టీ లో చేరారు.మంత్రి పొన్నం ప్రభాకర్ కొత్త తిరుపతి రెడ్డి ని పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఇక్కడ మండల అధ్యక్షులు దొంత సుధాకర్,ఎక్లాస్పూర్ గ్రామ శాఖ అధ్యక్షులుఅంబాల ప్రేమ్ కుమార్,దస్తగిరి,క్రాంతి కుమార్,రవీందర్,రాజు, రమేష్,సంపత్,శ్రీనివాస్,చోటే రఘుపతి,సురేష్,అశోక్, కిష్టయ్యరాజు,కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఉసకోయిల రాఘవులు, బొమ్మగానిరాజు, అనగోని శ్రీనివాస్,ఎల్ఎస్ సిఎస్ మాజీ డైరెక్టర్,వెల్ది రాజు,వెంకేపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు,యూత్ కాంగ్రెస్ నాయకులు తిరుపతి నాయక్ మండల నాయకులు పాల్గొన్నారు.

# కరీంనగర్ జిల్లా ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ అధ్యక్షులుగా శశిధర్‌శర్మ ఎన్నిక

**తొలి సమయం కరీంనగర్/సైదాపూర్/ సెప్టెంబర్ 28**



కరీంనగర్ జిల్లా సైదాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భౌతిక శాస్త్ర అధ్యాపకులుగా పని చేస్తున్న శశిధర్ శర్మ ను కరీంనగర్ లో జరిగిన ప్రభుత్వ జూనియర్ అద్యాపక అసోసియేషన్ ఎన్నికల లో ఏకగ్రీవంగా శశిధర్ శర్మ ను అధ్యక్షులు గా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా ఆయనను కళాశాలలో ప్రధాన అధ్యాపకులు మహేందర్ కుమార్ ఆధ్వర్యంలో సన్మానించారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు శశిధర్ శర్మ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ అధ్యాపక సంఘం నాపై నమ్మకంతో ఎన్నుకున్నందుకు అద్యాపక సంఘము తరుపున కృతజ్ఞతలు తెలిపారు.అధ్యాపకుల సమస్యల సాధనలో ఎప్పుడు అందుబాటులో ఉంటూ పరిష్కారం చూపుతానని, ప్రభుత్వ జూనియర్ కళాశాల లో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారి భవిష్యత్ కు తన వంతు సహకారం ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ గవర్నమెంట్ లెక్చరర్ అసోసియేషన్ కరీంనగర్ అధ్యక్షులు రాజశేఖర్,కృష్ణప్రసాద్,ట్రెజరర్ అధ్యాపకులు మహేంద్రావు, భాస్కర్,రాజు,రవి రాజశేఖర్, వినయ్,సుజాత తదితరులు పాల్గొన్నారు..

# జిల్లా పరిషత్‌లోని కారుణ్య నియామకాలను వెంటనే భర్తీ చేయండి

**రాష్ట్రంలోని 743 కారుణ్య ఖాళీలు ముఖ్యమంత్రికి కనపడకపోవడం బాధాకరం**

**బాధితులు 2014 నుండి వేచి చూస్తున్న ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం సిగ్గుచేటు**

**కారుణ్య ఖాళీలను భర్తీకి ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డికు బాధితుల వినతి**

**బీజేపీ రాష్ట్ర నాయకులు బేతి మహేందర్ రెడ్డి**

**తొలి సమయం, కరీంనగర్,సెప్టెంబర్ 28**





తెలంగాణ రాష్ట్రం వస్తే కొత్తగా నియామకాలు చేపట్టి నిరుద్యోగ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని ఎన్నో ఆశలతో ప్రత్యేక రాష్ట్రం కోసం కొట్లాడి తెచ్చుకుంటే తెలంగాణలో కొత్త నియామకాలు చేపట్టకపోగా న్యాయ బద్దంగా రావాల్సిన కారుణ్య నియామకాలను కూడా గత టి.ఆర్.ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం భర్తీ చేయకపోవడం బాధాకరమని బీజేపీ రాష్ట్ర నాయకులు బేతి మహేందర్ రెడ్డి అన్నారు. వివిధ కారణాలతో మృతి చెందిన జిల్లా పరిషత్ లోని ఉద్యోగుల కుటుంబాలలో ఒకరికి రావాల్సిన ఉద్యోగాలు 2014 సంవత్సరం నుండి 743 మంది కారుణ్య నియామకాలను భర్తీ చేయకుండా గత టి.ఆర్.ఎస్ ప్రభుత్వం, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేసారని ఈ ప్రధాన సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి కారుణ్య నియామకాలను వెంటనే భర్తీ చేసేలా ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలని కారుణ్య నియామకాల కోసం ఎదురు చూస్తున్న బాధితుల పక్షాన బీజేపీ రాష్ట్ర నాయకులు బేతి మహేందర్ రెడ్డి కామారెడ్డి కి వెళ్లి బీజేపీ ఎమ్మెల్యే కాటిపెల్లి వెంకటరమణ రెడ్డిని కామారెడ్డి లోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ లో కలిసి వినతి పత్రం ఇచ్చి తమ గోడును వెలిబుచ్చారు. బాధితుల ముందే ఎమ్మెల్యే కాటిపెల్లి వెంకటరమణ రెడ్డి వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫోన్ చేసి సమస్యను వివరించడంతో ముఖ్యమంత్రి వారం రోజుల్లోపు జిల్లా పరిషత్ లోని కారుణ్య నియామకాలను భర్తీ చేస్తానని ఎమ్మెల్యే వెంకటరమణ రెడ్డికి హామీ ఇవ్వడంతో సమస్య పరిష్కారం అవుతుందనే ఆశతో బాధితులు ఎదురుచూస్తున్నారని బేతి మహేందర్ రెడ్డి తెలిపారు. ఒకవేళ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కారుణ్య నియామకాలను భర్తీ చేయకపోతే ప్రభుత్వం పై నియామకాలు చేపట్టేదాకా తనే పోరాడుతానని బాధితులకు ఎమ్మెల్యే వెంకటరమణ రెడ్డి భరోసా ఇచ్చారని బేతి మహేందర్ రెడ్డి తెలిపారు.

# భగత్ సింగ్‌కి భారతరత్న అవార్డు ఇవ్వాలి

**భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించి, అమలు చేయాలి**

**ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి**



**తొలి సమయం సిద్దిపేట,సెప్టెంబర్ 28** సెప్టెంబర్ 28న భగత్ సింగ్ 117వ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ సిద్దిపేట జిల్లా సమితి ఆధ్వర్యంలో భగత్ సింగ్ 117వ జయంతి శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో భగత్ సింగ్ విగ్రహానికి ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు సిద్దిపేట జిల్లా నిర్మాణ బాధ్యులు మంద పవన్ తో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతు భగత్ సింగ్ జీవితం భారత దేశ యువతకు స్ఫూర్తిదాయకమని, అటువంటి మహనీయుని త్యాగాలను నేటి సమాజానికి తెలపాల్సిన భాద్యత పాలకులదేనని వారు ఉద్ఘాటించారు. భగత్ సింగ్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించాలని వారు డిమాండ్ చేశారు. ప్రజల ఐక్యతను చీల్చే మతోన్మాద రాజకీయాలు నేడు దేశంలో విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని, స్వాతంత్ర్య ఉద్యమ కాలంలోనైనా నేటి కాలంలోనైనా అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టి మరల్చి దోపిడీదారులకు ఉపకరించే, దేశ ద్రోహ కర్తవ్యాన్నే మతోన్మాద శక్తులు నెరవేరుస్తున్నాయని ధ్వజమెత్తారు.

దేశ స్వాతంత్ర్య సముపార్జన ధ్యేయంగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన భగత్ సింగ్ స్వాతంత్ర్య అనంతరం కుల, మతాలకు అతీతంగా ధనిక, పేద తారతమ్యాలు లేని, అవినీతి రహిత సమసమాజ స్థాపన కలలు కన్నాడన్నారు. మతోన్మాద ముక్త భారతం సాదించడానికి భగత్ ఆలోచనలు, ఆయన చూపిన కార్యాచరణ, మనకు తరగని స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. ఇనుప కండరాలు, ఉక్కునరాలు గల యువత దేశానికి అవసరం అని ప్రభోదించి సూక్తిగా నిలిచి "ఆత్మ విశ్వాసంకు మించిన ఆయుధం లేదని చాటి చెప్పిన భగత్ సింగ్ ప్రేరణతో, యువజనులతో మమేకమై ఉత్తేజ, ఉద్వేగభరితమైన ఉద్యమాలు సాగిస్తూ ఏఐ ఎస్ ఎఫ్ విద్యార్థుల గుండెల్లో నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు వేల్పుల ప్రసన్న కుమార్,సుధాకర్, అనిరుద్ తదితరులు పాల్గొన్నారు

# లోక్ ఆదాలత్‌ల ద్వారా కేసుల సత్వర పరిష్కారాలు : జిల్లా జడ్జి ప్రతిమ

**తొలి సమయం కరీంనగర్ /సెప్టెంబర్ 28**




పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించేందుకు రాజీ ద్వారా వారిపై కేసులు సత్వరంగా పరిష్కరించుకు నేందుకు లోక్ అదాలత్ లతో మాత్రమే సాధ్యమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్, జిల్లా జడ్జి బి ప్రతిమ తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ లో భాగంగా శనివారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవాసదన్ లో లోక్ అదాలత్ ప్రారంభ కార్యక్రమానికి హాజరై జడ్జి మాట్లాడారు. లోక్ అదాలతులపై ప్రజల్లో అవగాహన పెరిగి అపోహలు తగ్గుతున్నాయని ప్రతి లోకదాలత్ లో పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కారం అవుతున్నాయని తెలిపారు. ఈ లోక్ అదాలత్ విజయానికి సహకరించిన అందరికీ జిల్లా జడ్జి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఈ లోకదాలత్ లో పోలీస్ అధికారులు ఎక్కువ సంఖ్యల కేసుల పరిష్కారానికి కృషిచేసా రని, పోలీస్ అధికారులను ఆయన ఈ సందర్భంగా అభినందించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు పివి రాజ్ కుమార్ మాట్లాడుతూ లోక్ అదాలత్ లు సత్ఫలితాలను ఇస్తున్నాయని, వీటికి న్యాయవాదుల పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి వెంకటేష్ మాట్లాడుతూ లోక్ ఆదాలత్ లు,వాటి పనితీరు గూర్చి వివరించారు. అనంతరం జిల్లా జడ్జి మోటారు ప్రమాద పరిహారం కేసు పరిష్కరించి లోకదాలత్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు వెంకటేష్, సాధన,కుమార్ వివేక్,నీరజ, లక్ష్మీకుమారి శ్రీలేఖ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూ టర్లు గౌరు రాజిరెడ్డి, జూలూరు శ్రీరాములు, గడ్డం లక్ష్మణ్, వీరస్వామి,రంజిత్, ఏసీపీలు నరేందర్,విజయ్ కుమార్, సీఐ లు విజయ్ కుమార్, స్వామి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్ రెడ్డి, మెజిస్ట్రేట్లు,ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు, బ్యాంక్ అధికారులు, న్యాయవాదులు కక్షి దారులు పాల్గొన్నారు.

# విద్యావంతులు రాజకీయాల్లోకి రావాలి

**పట్టభద్రులకు బాసటగా నిలుస్తా**

**ఎమ్మెల్సీగా గెలిస్తే వచ్చే ప్రతి పైసా నిరుపేదల కోసం ఖర్చు చేస్తా**

**స్టడీ సెంటర్లు, గ్రంధాలయాలు ఏర్పాటు చేసి ఉన్నతమైన విద్యను అందిస్తా**

**ప్రైవేటు ఉద్యోగుల కు హెల్త్ కార్డుల జారీకి కృషి చేస్తానని వెల్లడి**

**పట్టబద్రుల సభ్యత్వ నమోదు అవగాహన సదస్సులో డాక్టర్ వి నరేందర్ రెడ్డి**





**తొలి సమయం హుస్నాబాద్, సెప్టెంబర్ 28**

పట్టభద్రులకు బాసటగా నిలవాలని సంకల్పంతో రానున్న కరీంనగర్ అదిలాబాద్ నిజామాబాద్ మెదక్ పట్టభద్రుల ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్టు ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం హుస్నాబాద్ పట్టణంలో పలు ప్రైవేటు ,ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాలలోతో పాటు బార్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి పట్టభద్రుల ఓట్ల నమోదుపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ విద్యారంగంలో గత 34 సంవత్సరాల నుండి క్రమశిక్షణ విలువలతో కూడిన విద్యను అందిస్తు తెలంగాణ విద్యారంగంలో అగ్రగామిగా నిలిచానని ఎంతోమంది నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించడంతోపాటు తన సంస్థలో వేలమంది ఉపాధ్యాయులకు ఉద్యోగ ఉపాధి కల్పిస్తున్నారని వెల్లడించారు. ఆంధ్ర కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ఐ ఐ టి, ఎన్ ఈ ఈ టి లో అద్భుత ఫలితాలు సాధించారని గుర్తు చేశారు. కొన్ని లక్షల మంది విద్యార్థులను ఇంజనీర్లుగా డాక్టర్లుగా భావి భారత పౌరులుగా తన సంస్థ తీర్చిదిద్దని అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో న్యాయవాదులు డాక్టర్లు ప్రైవేటు ప్రభుత్వ ఉద్యోగులు చాలా ఇబ్బందుల్లో ఉన్నారని వారి సమస్యలకు విద్యావంతుడైన తనను రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో గెలిపిస్తే ఉద్యోగ నిరుద్యోగ పట్టబద్దుల సమస్యలపై నిరంతరం చిత్తశుద్ధి తో పోరాడుతానని వెల్లడించారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజు రియంబర్స్మెంట్ విడుదల కాక చాలా ఇబ్బందుల్లో ఉన్నారని ,ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల ప్రధాన సమస్య అయిన హెల్త్ కార్డుల జారీ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని వెల్లడించారు. విద్యారంగంలో తెలంగాణ పొరుగు రాష్ట్రాల కంటే వెనుకబడి ఉందని నూతన విద్యా విధానం తీసుకురావాలని దానికోసం కృషి చేస్తానని వెల్లడించారు.ఎమ్మెల్సీగా గెలిస్తే వచ్చే ప్రతి పైసలు పేద విద్యార్థులు నిరుద్యోగుల కోసం సంక్షేమ నిధి ఏర్పాటు చేసి వారి కోసమే వెచ్చిస్తానని వెల్లడించారు. ప్రతి మండలంలో లైబ్రరీలు స్టడీ సెంటర్లు ఏర్పాటు చేయించి నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తానని వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చోరువుతో 11 సంవత్సరాల నిరీక్షణకు తెరదించుతూ ఆదర్శ పాఠశాలల్లో ఉపాధ్యాయుల బదిలీలతో పాటు చాలా పాఠశాల ల్లో ఎంఈఓ డిఈఓ లను నియమించాలని గుర్తు చేశారు.

## 110 ఏళ్లకు వెంకటాపురంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు

**గొండ్వానా సంక్షేమ పరిషత్**



**తొలి సమయం నూగురు వెంకటాపురం సెప్టెంబర్ 28**

నూగురు వెంకటాపురం మండలంలో శనివారంనాడు ఆర్ అండ్ బి విశ్రాంతి భవనంలో జీఎస్పీ అత్యవసర సమావేశం జీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో జీఎస్పీ ఉభయ రాష్ట్రాల కన్వీనర్ సొంది వీరయ్య మాట్లాడుతూ బ్రిటిష్ హయాంలోనే, మద్రాస్ ప్రెసిడెన్సీలో భద్రాచలం, నూగూర్, వెంకటాపురం తాలూకాలో ఉండేద ని, భద్రాచలంలో విద్యార్థి ఉద్యమాల వలన ఉమ్మడి జిల్లా కలెక్టర్ ఏ గిరిధర్ ఐఏఎస్ ఆనాటి జి ఎస్పి పోరాటాలకు చలించి భద్రాచలం కేంద్రంలో ఎస్ ఎం హెచ్ విద్యార్థులకు కాలేజీ వసతి గృహం మంజూరు చేసి భవనాలు నిర్మానాలకు, హాస్టల్ పదవ తరగతి విద్యార్థుల అందరికి ఎస్ ఎం హెచ్, విద్యార్థి, విద్యార్థులకు కాలేజీ లో సీట్లు కల్పిస్తూ, ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. 267జీవో ని అమలు చేయించారని అన్నారు.ప్రభుత్వ జూనియర్ కాలేజీ తో పాటు డిగ్రీ కాలేజీ మంజూరు అయిందని అన్నారు.వెంకటాపురం మండల కేంద్రం లో, ఎస్ ఎం హెచ్ హాస్టల్స్ ను ప్రోత్సాహించవలసిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. వెంకటాపురం మండల తహసీల్దార్ విద్యాలయాలను నిత్యం పర్యవేక్షణ చేయాలనీ కోరారు. సుమారు 110ఏళ్ల తర్వాత మంజూరు అయినా ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఎస్సి, ఎస్టీ, బిసి లతో అందరికి ఉపయోగ పడే కళాశాల అభివృద్ధి కి సహకరించవలసిందిగా కోరారు. 110ఏళ్ల తర్వాత వచ్చిన ప్రభుత్వ జూనియర్ కళాశాల అన్ని వర్గాల ప్రజల కు ఉపయోగ పడుతుందని అన్నారు. పూర్వ కాలం నుండి నేటి తరం స్థానిక విద్యార్థి, విద్యార్థులందరు ఇప్పటి 180మంది విద్యార్థులు జాయిన్ అయినారని,జిల్లా పరిషత్ పాఠశాల ఎం ఈ ఓ తెలిపారు. త్వరలో ఎస్ ఎం హెచ్ వ్యవస్థ ను కూడా ప్రారంభం చేసి స్థానిక విద్యార్థిని, విద్యార్థులకు జి ఎస్పీ అండగా ఉంటుందని అన్నారు. ఈకార్యక్రమంలో జిఎస్పీ జిల్లా అధ్యక్షులు రెగ గణేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం ప్రతాప్, జిల్లా ప్రధాన కార్యదర్శి కనితి వెంకటకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి

**ఏఎన్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి**

**భూ తాపాన్ని తగ్గించేందుకు అందరు కృషి చేయాలి న్యాయవాది వాసం నాగరాజు**





**తొలి సమయం నూగూర్ వెంకటాపురం సెప్టెంబర్ 28**

వెంకటాపురం మండలం కేంద్రంలోని చిరుతపల్లి -2ఆశ్రమ బాలికల పాఠశాలలో పచ్చదనం పరి శుభ్రతను విద్యార్థులు విధిగా పాటించాలని మాజీ సర్పంచి కొర్స నర్సింహా మూర్తి తెలిపారు . స్వచ్ఛత హీ సేవలో భాగంగా పంచాయతీ కార్యదర్శి తాటి మౌనిక,చిరుతపల్లి,బాలికల ఆశ్రమ పాఠశాలలో శనివారం సంస్కృతిక కార్యక్రమాలు, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కబడ్డీ, కోకో వంటి క్రీడలు నిర్వహించారు. పోటీలో గెలుపొందిన వారికి ప్రధాన ఉపాధ్యాయులు సపక నాగరాజు, మాజీ సర్పంచి కొర్స నర్సింహా మూర్తి, న్యాయవాది వాసం నాగరాజు, బహుమతులు ప్రధానం చేశారు. ప్లాస్టిక్ వాడకాన్ని క్రమంగా తగ్గించాలని అన్నారు.ప్లాస్టిక్ కారణంగా భూ తాపం పెరుగుతోంది అన్నారు. పకృతి విపత్తులు ఏర్పడి మానవాళికి ముప్పు సంభవించే ప్రమాదం ఉందని విద్యార్థులకు తెలిపారు. ఇంత చక్కటి కార్యక్రమం నిర్వహించినందుకు పంచాయతీ కార్యదర్శి మౌనిక,ను ప్రధాన ఉపాధ్యాయడు నాగరాజు,ప్రజలు ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు,ఉపాధ్యాయులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## హిందువుల సంఘటిత శక్తి చాటాల్సిన సమయం ఆసన్నమైంది

**హిందూ వాహిని ప్రాంత బాధ్యులు రుద్రోజు శ్రీనివాస్, సూర్యప్రకాష్**



**తొలి సమయం, కరీంనగర్ /సెప్టెంబర్ 28**

హిందువులకు సంఘటిత శక్తి చాటి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని, ముఖ్యంగా హిందూ సంఘాల ఐక్య వేదికలను ఏర్పాటు చేసుకొని , అన్ని కుల సంఘాలను, ధార్మిక సంఘాలను, హిందూ సంఘాలను ఏకం చేసి , జాతీయస్థాయిలో సనాతన బోర్డు ఏర్పాటుకు కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని హిందు వాహిని ప్రాంత బాధ్యులు రుద్రోజు శ్రీనివాస్, ఆర్య సమాజ్ కరీంనగర్ శాఖ వ్యవస్థాపకులు సూర్య ప్రకాష్ అన్నారు. శనివారం రోజున కరీంనగర్ లోని మలయాళ సద్గురు గీతా మందిరం మఠంలో, వివిధ కుల సంఘాలు,ధార్మిక సంస్థల, హిందూ ధర్మ సంఘాల ముఖ్య సమావేశం జరిగింది. ఇట్టి సమావేశంలో హిందువుల సమస్యల పై మాట్లాడి పలు విషయాలను తీర్మానించారు. ప్రధానంగాతిరుపతి లడ్డు అపవిత్రత,. దేవాలయ భూములు అన్యాక్రాంతం కావడం,లవ్ జిహాద్ కేసులు పెరిగిపోవడం, హిందూ ధర్మ రక్షకులపై పోలీస్ ల అణచివేత కేసులు ఎక్కువ కావడం, హిందు సంఘాల బాధ్యుల పట్ల ప్రభుత్వం, పోలీసులు అణిచివేత ధోరణి ని అవలంబించడం, దేవాలయాలను ప్రభుత్వ చెరనుండి విడిపించడానికి తీవ్రస్థాయిలో పోరాటం చేయాలనే విషయాలపై చర్చలు జరిపి తీర్మానాలు చేశారు. అలాగే హిందూ సంఘాల ఐక్యవేదిక ఏర్పాటు చేసి, అన్ని కులాల హిందూ బాధ్యులందరినీ భాగస్వామ్యం చేసి, హిందూ కార్యకర్తలకు ఆర్థిక, న్యాయ సహాయం అందించే విషయంపై సమావేశంలోతీర్మానం చేశారు. ఇట్టి సమావేశంలో హిందూవాహిని జిల్లా సంయోజక్ బెజ్జెంకి శ్రీకాంత్ తో పాటు వివిధ హిందూ ధార్మిక సంస్థల బాధ్యులు పాల్గొన్నారు.

## అమ్మ ఆదర్శ పాఠశాలల తుది దశ పనులను
# త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలి

### కలెక్టర్ పి. ప్రావీణ్య



**తొలి సమయం హన్మకొండ సెప్టెంబర్ 28**

ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలను మెరుగుపరిచేందుకు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులు తుది దశకు చేరగా వాటిని త్వరగా పూర్తి చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన వివిధ పనులకు సంబంధించి డీఈవో వాసంతి, జెడ్పి సీఈవో విద్యాలత, డిఆర్డీవో నాగ పద్మజ, ఎంపీడీవోలు, ఎంపీఓ, ఎంఈవో, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, తదితర శాఖల ఈఈ, డిఈ, ఏఈలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో వివిధ మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలతో పాటు నిర్మాణ దశలో ఉన్న వివిధ పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఏవైన చిన్న చిన్న పనులు ఉంటే వాటికి ముందు ప్రాధాన్యత నిచ్చి పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో అభివృద్ధి పనులను నాణ్యతగా వేగవంతంగా పూర్తి చేసేందుకు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో త్వరగా పూర్తి చేయాలన్నారు. పది రోజుల్లో అభివృద్ధి పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులను పెండింగ్ లో ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా మన ఊరు మనబడి కార్యక్రమంలో చేపట్టిన పనులలో ఎక్కడైనా చిన్నచిన్న పనులు ఉన్నట్లయితే వాటిని పూర్తి చేయాలన్నారు. అంగన్వాడి పాఠశాలల్లో చేపట్టిన పనులను కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో సిపిఓ సత్యనారాయణ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, ఆర్ అండ్ బి ఈఈ సురేష్ బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ఏర్పాట్లను సిద్ధం చేయాలి

### అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి



**తొలి సమయం హన్మకొండ,సెప్టెంబర్ 28**

అక్టోబర్ రెండవ తేదీ నుండి ప్రారంభమయ్యే బతుకమ్మ, దసరా ఉత్సవాలకు అధికారులు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎ. వెంకట్ రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో దేవాదాయ, రెవెన్యూ, విద్యుత్, సాగునీటిపారుదల, మున్సిపల్, పంచాయతీరాజ్, పోలీస్, మత్స్య, తదితర శాఖల అధికారులతో పాటు వేయి స్తంభాల గుడి, పద్మాక్షమ్మ దేవాలయం, మెట్టుగుట్ట, తదితర ఆలయాల అర్చకులతో బతుకమ్మ, దసరా ఉత్సవాల ఏర్పాట్లపై సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో, నగర పరిధిలో మహిళలు బతుకమ్మ ఆడుకునే ఆలయాల వద్ద పారిశుద్ధ్య నిర్వహణ, విద్యుత్ దీపాలు, తదితర ఏర్పాట్లను సంబంధిత శాఖల అధికారుల సిద్ధం చేయాలన్నారు.పారిశుద్ధ్య నిర్వహణ ఎప్పటికప్పుడు జరిగేలా చర్యలు చేపట్టాలని, బతుకమ్మ నిమజ్జనం అనంతరం పారిశుద్ధ్యం సక్రమంగా జరిగే విధంగా చూసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఎక్కడ కూడా చిన్న ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జనం చేసే చెరువుల వద్ద తగిన ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో సిద్ధం చేయాలన్నారు. వేయి స్తంభాల దేవాలయం, పద్మాక్షి దేవాలయం, మెట్టు రామలింగేశ్వర స్వామి దేవాలయాల వద్ద ప్రభుత్వం తరపున చేయాల్సిన ఏర్పాట్లను గురించి అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ, శంకర శర్మ, విష్ణువర్ధనాచార్యులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సునీత మాట్లాడుతూ దేవాదాయ శాఖ తరపున ఆలయాల వద్ద బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ఏర్పాట్లను చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని ఆలయాల వద్ద పారిశుద్ధ్య నిర్వహణ ఏర్పాట్లను ఇప్పటికే మొదలుపెట్టినట్లు ముఖ్య వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రాజేష్ తెలిపారు. పోలీస్ శాఖ తరపున బతుకమ్మ ఉత్సవాలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయనున్నట్లు డీసిపి రవి పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితా దేవి మాట్లాడుతూ ఆలయాల వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతోపాటు అంబులెన్స్ ని సిద్ధంగా ఉంచుతామన్నారు.ఈ సమావేశంలో డీఆర్వో వై. వి. గణేష్, జడ్పీ సీఈవో విద్యాలత, డిఆర్డిఓ నాగ పద్మజ, డిపిఓ లక్ష్మీ రమాకాంత్, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్, డాక్టర్ నారాయణ, హనుమకొండ ఏసిపి దేవేందర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులతో పాటు ఎంపీడీవోలు పాల్గొన్నారు.

# రెవెన్యూ ఆదాయం పెంపు పై ప్రత్యేక శ్రద్ధ వహించండి

**బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే**

**భువన్ ఆప్ లో సర్వే డేటా నమోదు పురోగతి పై సమావేశం**

**అప్డేట్ సమాచార నమోదు తీరు పై దృశ్య మాధ్యమం ద్వారా ఆర్ ఐ లకు అవగాహన**

**తొలి సమయం,వరంగల్ సెప్టెంబర్ 28**

రెవెన్యూ అధికారులు ఆదాయ పెంపు పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో భువన్ ఆప్ లో సర్వే డేటా నమోదు పురోగతి పై ఏర్పాటు చేసిన సమావేశం లో కమిషనర్ పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆర్ ఐ ల వారిగా కేటాయించిన డివిజన్ ల ప్రాతిపదికన భువన్ యాప్ లో నమోదు చేసిన అసెస్మెంట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సి జి జి) లో బల్దియా పరిధిలో ఉన్న 66 డివిజన్ల అసెస్మెంట్ ల సమాచారం నమోదు చేయడం జరిగిందని అట్టి సమాచారానికి భువన్ అప్ లో నమోదు చేసిన సమాచారంతో సరి పోల్చుకొని చూడాలని ఆర్ ఐ లకు సూచించారు.




భువన్ ఆప్ లో గల సమాచారం ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అప్డేట్ (నవీకరణ) చెందుతుందని ఇట్టి విషయంపై ఆర్ ఐ లకు అవగాహన అవసరం అని ఏదైనా సమాచారాన్ని నవీకరించే క్రమంలో అందులో పేర్కొన్న విధంగా కాలమ్స్ లో సమగ్ర సమాచారాన్ని పూరించాలని (అందించాలని)ప్రభుత్వం 2007లో అందజేసిన గెజిట్ ఉత్తర్వుల ప్రకారం నిబద్ధతత తో అసెస్మెంట్ ల సమాచార నమోదు చేపట్టి రెవెన్యూ ఆదాయం పెంపు పై ఆర్ ఐ లు దృష్టి సారించాలని నమోదిత అసెస్మెంట్ ల సమాచారాన్ని ఆర్ ఐ లు ర్యాండం గా క్షేత్ర స్థాయి లో పర్యటించి (తనిఖీ చేసి) సి జీ జీ తో పాటు భువన్ ఆప్ లో ఖచ్చితం గా నమోదు జరిగిందో లేదో పరిశీలించాలని బల్దియా వ్యాప్తంగా 2979 అసెస్మెంట్ల దరఖాస్తుల అసెస్మెంట్ల సమాచారం భువన్ సిజీజీకి సరిపోలడం (మ్యాచ్) లేదని సంబంధిత ఆర్ ఐ లు క్షేత్ర స్థాయి లో పరిశీలించి పిటి ఎం నంబర్ ద్వారా ధృవీకరణ జరిపి సంబంధిత ప్రాంత డిప్యూటీ కమిషనర్లచే ఎడిట్ జరిగేలా చూడాలని కమీషనర్ అన్నారు.అనంతరం అప్డేట్ (నవీకరణ) ప్రోఫార్మా లో అసెస్మెంట్ సమాచార నమోదు తీరును అధికారులు ఆర్ఐలకు దృశ్య మాధ్యమం ద్వారా వివరించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సిహెచ్ రాజేందర్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్లు కృష్ణారెడ్డి, రవీందర్, పన్నుల అధికారి బిర్రు శ్రీనివాస్,ఆర్ వో లు యూసిఫోద్దీన్, శ్రీనివాస్,షహజాదీ బేగం ఐటి మేనేజర్ రమేష్ ఆర్ ఐ లు తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ భవన్‌లో జనతా గ్యారేజ్

**తొలి సమయం హైదరాబాద్,సెప్టెంబర్28** అధికారంలో ఉన్నప్పుడు సమస్యలు చెప్పుకోవాలని వచ్చిన ప్రజలను పట్టించుకోని బిఆర్ఎస్ ఇప్పుడు జనతా గ్యారేజ్ ప్రారంభించింది. సిఎంను కలవాల్సిన అవసరమేముందన్న పెద్దమనిషి ఇప్పుడు మేము ప్రజల సమస్యలు వింటామని ప్రకటించారు. వివిధ సమస్యలు చెప్పుకోవడానికి రండి అంటూ..తెలంగాణ భవన్ తలుపులు తెరిచారు. హైడ్రా చర్యలతో తల్లడిల్లుతున్న ప్రజలు ఇప్పుడు బీఆర్ఎస్ ఆఫీస్‌కు క్యూ కడుతున్నారు. శనివారం ఉదయం నుంచి ఆ ప్రాంతమంతా జనంతో కిక్కిరిసిపోయింది. ప్రజా సమస్యలు వినేందుకు మాజీ మంత్రులు, బీఆర్ఎస్‌లో కీలక నేతలంతా ఆఫీస్‌లోనే తిష్ట వేశారు. బాధితులు చెబుతున్న సమస్యలను వింటున్నారు. వాటిని నోట్ చేస్తున్నారు. అధికారంలో ఉండగా ఇలాంటి ప్రయత్నం చేసివుంటే ప్రజలు బాగు పడేవారు. వారు ఆశీర్వదించే వారు. కానీ చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా ఇప్పుడు జనం గుర్తుకు వచ్చారు. అధికారంలో ఉండగా అక్రమ కట్టడాలపై కెసిఆర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. అక్రమాలను తొలగించాల్సిందేనని అన్నారు. మీడియా సహకరించాలన్నారు. అధికారం పోవడంతో ఇప్పుడు వారి స్టాండ్ రివర్స్ అయ్యింది. హైడ్రా కూల్చివేతలపై కెటిఆర్ మండిపడ్డారు. ప్రజలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వారి ఇళ్లను కూల్చేస్తున్న ప్రభుత్వం పెద్దలను మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇలా హైడ్రా బాధితుల కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. వివిధ మార్గాల్లో వారంతా బీఆర్ఎస్‌కు ఫిర్యాదు చేయవచ్చని వెల్లడించారు. న్యాయ సహాయం కూడా చేస్తామని అన్నారు. సోషల్ మీడియా, ఫోన్, మెయిల్స్‌తోపాటు నేరుగా వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని కేటీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు. పక్కా అనుమతులతోనే కట్టించుకున్న భవనాలను ఎలా కూలుస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇలాంటి వారికి బీఆర్ఎస్ ఎప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. తెలంగాణ భవన్ గేట్లు ఎప్పుడూ తెరిచే ఉంటాయని వాళ్లు వచ్చి తమ సమస్యలు చెప్పుకోవచ్చని పిలుపునిచ్చారు.

## టిజిఎమ్ఆర్ ఎస్ వేములవాడ
# బాయ్స్ యొక్క ప్రభంజనం



**తొలి సమయం, వేములవాడ,సెప్టెంబర్ 28**

టి జి ఎమ్ అర్ ఎస్ సిరిసిల్ల జిల్లా స్థాయి యువజన ఉత్సవాలలో భాగంగా అన్ని విభాగాల్లో పాల్గొన్నటువంటి విద్యార్థులు హ్యాండ్ క్రాఫ్ట్, కవిత్వం విభాగంలో మొదటి స్థానంలో నిలిచి స్టేట్ కాంపిటీషన్ కి ఎంపికయ్యారు. అదేవిధంగా సోలో సాంగ్ లో ఏ.రాజు ప్రదర్శన అద్భుతంగా చేస్తూ ఈ కార్యక్రమంలో 20 కి పైగా బృందాలు పాల్గొనగా ఏ.రాజు రెండవ స్థానంలో నిలిచాడు. ఈ కార్యక్రమంలో గెలిచిన విద్యార్థులకు సిరిసిల్ల డి ఈ ఓ చేతుల మీదుగా సర్టిఫికెట్ లు మెమొంటో అందించారు.ఇదే పాఠశాలకు చెందిన ఈ.మహిపాల్ జగిత్యాల జిల్లా యువజన ఉత్సవం పోటీల్లో హ్యాండ్ క్రాఫ్ట్ లో మొదటి స్థానంలో వచ్చి స్టేట్ కి సెలెక్ట్ అయినట్లు ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థి యొక్క కృషి,పట్టుదల వారి యొక్క నైపుణ్యాలను ప్రదర్శిస్తూ విద్యతోపాటు సాంస్కృతిక, సృజనాత్మకత లో మెలుకువలు ప్రదర్శిస్తూ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో వచ్చి రాష్ట్రస్థాయికి ఎంపిక అవడం పట్ల సంతోషాన్ని వ్యక్తం పరుస్తూ మునుమందు ఇంకా ఎన్నో పథకాలు సాధిస్తామని విద్యార్థులకు ఆర్ట్ టీచర్ జి చోలేశ్వర్ చారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బోధన సిబ్బంది, బోధ నేతల సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

## నేడు ఎల్కతుర్తి మండలంలో విద్యుత్తు సరఫరా కు అంతరాయం

**తొలి సమయం,ఎల్కతుర్తి, సెప్టెంబర్ 28**

ఎల్కతుర్తి మండలం కేంద్రం లో నేడు ఆదివారం నాడు పలు అభివృద్ధి పనులు కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని టీజి ఎన్పీడీసీఎల్ ఏఈ లక్ష్మణ్ నాయక్ తెలిపారు. ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ఎల్కతుర్తి మండల కేంద్రంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

## గుండె పోటుతో డిఆర్ఎఫ్ ఉద్యోగి మృతి

**ఆర్థిక సహాయం అందజేసిన మేయర్ కమీషనర్**





**తొలి సమయం వరంగల్,సెప్టెంబర్ 28**

బల్దియా డి ఆర్ ఎఫ్ విభాగం (ఔట్ సోర్సింగ్) లో విధులు నిర్వహిస్తున్న నాగపూరి కుమార స్వామి (55) శనివారం గుండె పోటుతో బట్టుపల్లి లోని ఆయన నివాసం లో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఈ సందర్భం గా ఉద్యోగి మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న నగర మేయర్ గుండు సుధారాణి మృతుని కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారని అంత్యక్రియల నిర్వహణకు గాను బల్దియా నుండి రూ.10 వేలు కమీషనర్ అందజేస్తున్నట్లు డి ఎఫ్ ఓ శంకర్ లింగం తెలిపారు.అనంతరం నిర్వహించిన అంత్యక్రియల్లో డి ఎఫ్ ఓ తో పాటు జూనియర్ అసిస్టెంట్ భరత్ కుమార్ డి ఆర్ ఎఫ్ సిబ్బంది బంధు మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో బతుకమ్మ సందడి

**తొమ్మిది రోజుల పాటు సాగనున్న పూలపండగ**



**తొలి సమయం వరంగల్,సెప్టెంబర్28:**తెలంగాణ పూల జాతరకు వేళైంది..తెలంగాణ ఆడబిడ్డలు ఎంతో సంబురంగా జరుపుకునే పండుగ బతుకమ్మ రానే వచ్చేసింది. ప్రతీ యేటా భాద్రపద అమావాస్య మొదలు ఆశ్వియుజ శుక్ల అష్టమి వరకు తొమ్మిది రోజులు బతుకమ్మ పండుగ జరుపుకుంటారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు జీవన విధానానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగ వేళ తొమ్మిది రోజుల పాటూ రాష్ట్ర వ్యాప్తంగా ఊరూ వాడా ఎక్కడ చూసినా సందడే కనిపిస్తుంది. మహిళలు ఆడిపాడి ఆనందిస్తారు. ఊరూరా మహిళల సందడి కనువిందు చేయనుంది. ఈ తొమ్మిది రోజుల పాటు మహిళలు రోజుకో విధమైన బతుకమ్మను పేర్చి పండుగ సంబరాలు జరుపుకుంటారు. చిన్నా పెద్దా వేడుకలలో పాల్గొంటారు. ముచ్చటగా ముస్తాబై బతుకమ్మలు తయారు చేసి అంతా కలసి ఆడిపాడతారు. ఎంగిలి పూల బతుకమ్మతో మొదలై సద్దుల బతుకమ్మతో సంబరాలు ముగుస్తాయి. అలిగిన బతుకమ్మ ఒక్క రోజు మినహా మిగతా ఎనిమిది రోజులు వైవిధ్యమైన నైవేద్యాలు అమ్మవారికి సమర్పిస్తారు. తీరొక్క పూలను అందంగా స్తూపం, శంఖం, గోపురం ఆకారంలో అమర్చుకుంటారు. బతుకమ్మను ప్రధానంగా తంగేడు పూలు, గునుగు, గుమ్మడి, మందార, బంతి, చేమంతి, అడవి చామంతి, గోరింట, బీర పువ్వులతో పేరుస్తుంటారు. ఈ ఏడాది బతుకమ్మ పండుగ అక్టోబర్ 2 నుంచి 10 తేదీ వరకు జరుపుకోనున్నారు. ఈ యేడు విస్తారంగా కురిసిన వర్షాలతో ఎటు చూసిన అడవి పూలు అందంగా విరబూసి పలకరిస్తున్నాయి. అలాగే చెరువుఉల జలకళను సంతరించుకున్నాయి. భక్తితో బతుకమ్మను పూజించేం దుకు మహిళలు సిద్ధంగా ఉన్నారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి సమర్పించే నైవేద్యాలకు అనుగుణంగా బతుకమ్మ పేర్లు కూడా ఉంటాయి. సద్దుల బతుకమ్మ చివరి రోజు పోయిరా బతుకమ్మ అంటూ వాటిని నీటిలో వదిలి ఆడవాళ్ళు అమ్మవారికి నమస్కారం చేసుకుంటారు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST:MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101